## సౌప్తికపర్వ కథాంశాలు

సౌప్తిక పర్వమున మదునెనిమిది అధ్యాయములు, 2 ఉపపర్వలు, 803 శ్లోకాలు గలవు. యుద్ధరంగమున దుర్యోధనుడు మట్టికరిచెను. అతని దుర్దశ చూచి అశ్వత్థామ మిక్కిలి వ్యథచెందెను. దుర్యోధనుని ఆజ్ఞ ననుసరించి కృపాచార్యుడు అశ్వత్థామను సేనాపతిని చేసెను. పిమ్మట అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలు ముగ్గురు దక్షిణ దిక్కు వైపు వెడలి సూర్యాస్తమయ సమయమున సైనిక శిబిరము చేరిరి. తదనంతరము శత్రువులు దాడి చేతురను భయముతో అరణ్యమున దాగుకొని విశ్రమించిరి. వారి శరీరములు అస్త్రఘాతములచే గాయపడెను. ఇంతలో పాండవుల విజయగర్జన విని భయపడి వారు ముగ్గురు తూర్పు దిక్కు వైపు పారిపోయిరి. దాహముచే పీడింపబడిరి. వారి గుఱ్ఱములు కూడా అలసిపోయినవి. దుర్యోధనుడు నేలకొరుగుటచే దుఃఖించిన వారు కొంత సమయము వరకు అక్కడనే ఉండిరి.

దుర్యోధనుడు అధర్మపూర్వకముగా నేల కొరిగినప్పుడు కృతవర్మ, కృపాచార్య, అశ్వత్థామలు ఏమిచేసిరని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించగా అతడు ఇట్లు చెప్పెను. ఆ ముగ్గురు వీరులు గుఱ్ఱముల దాహార్తిని తీర్చి ఘోరారణ్యమందు ప్రవేశించిరి. స్నానసంధ్యావందనాదులను ముగించి అలసటచే ఆరాత్రికి వారు వటవృక్షము క్రింద పరుండిరి. కృపాచార్య కృతవర్మలు నిద్రపోగా అశ్వత్థామకు నిద్రరాలేదు. వారు విశ్రమించిన వటవృక్షముపై వేలకొలది కాకులు నివసించు చున్నవి. అవి రాత్రి తమ తమ గూళ్ళలో సుఖముగా నిద్రించినవి. ఇంతలో భయంకరమగు గుడ్లగూబ అచ్చటకువచ్చి తనకు కనిపించిన కాకుల నన్నిటిని చంపివేసెను. మోసముతో గూడిన క్రూరకర్మనుచూచి అశ్వత్థామ తానుకూడా మోసముతో శత్రువులను చంపుటకు నిశ్చయించెను. కృపాచార్యకృతవర్మలను లేపి అశ్వత్థామ పాంచాలురతో సహా పాండవులను చంపుటకు తన నిర్ణయమును వినిపించెను. అతని కపట పూర్ణ వ్యవహారమును విని ఇద్దరూ సిగ్గుపడిరి. నోటమాటరాలేదు. తిరిగి అశ్వత్థామ "పరాక్రమసంపన్నుడగు దుర్యోధనుడు పాండవులచే చంపబడెను. కౌరవపక్షమున అందరు నశించిరి. కేవలము మనం ముగ్గురము మాత్రమే మిగిలితి"మని చెప్పగా కృపాచార్యుడు "మానవులందరు దైవికము, పౌరుషమను రెండు కర్మలచే

బంధింపబడియున్నారు. రెండిటి సంయోగమువలననే కార్యసిద్ధి జరుగును. ఈ రెండిటిలో దైవికము ప్రబలమైనది. దైవము సహయోగము వలననే పురుషప్రయత్నము ఫలించును. దుర్యోధనుడు లోభి, దూరదృష్టిలేని వాడు. హితమును వినక పాండవులతో
విరోధము తెచ్చుకొని ఫలితము ననుభవించుచున్నాడు.పాపిని అనుసరించుటవలన మనకు కూడా అనర్థము కల్గినది. ఎవరైనా హిత, అహితములను నిర్ణయింప లేనప్పుడు స్నేహితుల సలహా తీసుకోవలెను. కనుక మనము ధృతరాష్ట్రు, గాంధారి, విదురులను చేయదగిన కర్తవ్యము గూర్చి అడిగెద"మని హితవచనములు పలుకగా అశ్వత్థామ మరింత దుఃఖపడి వారిద్దరితో ప్రతి పురుషుని యందు వేరు వేరు ఆలోచనలుండును. ప్రతి ఒక్కడు తన బుద్ధియే గొప్పదని తలచి సంతోషిస్తూ ఇతరులను నిందిస్తూ ఉందురు. మనుష్యుడు తన వివేకము ననుసరించి ఏ ఆలోచన మంచిదని తలుస్తాడో దాని ద్వారా కార్యమును సాధిస్తాడు. సంకటకాలమున నాకు తోచిన ఆలోచనను మీయిద్దరికి చెప్పితిని. నేను పూజింపదగిన బ్రాహ్మణ కులమున పుట్టితిని. అయినప్పటికి దురదృష్టముచే క్షత్రధర్మము నాశ్రయించితిని. అన్యాయముగా నాతండ్రి చంపబడ్డాడు. దానికి తప్పక ప్రతీకారము తీర్చుకొందును. రాత్రి ప్రశాంతముగ నిద్రపోతున్న పాంచాలురను శిబిరములో ప్రవేశించి చంపెదను. పాండవ పుత్రులను కూడా నాశము చేసెదనని చెప్పెను.

అశ్వత్థామ మాటలు విని కృపాచార్యుడు తాతా! నీ మనస్సున ప్రతీకారభావన పుట్టినది. ఎవరూ నిన్ను ఆపలేరు. ఈరోజు రాత్రి విశ్రాంతి తీసుకొనుము. రేపటి యుద్ధమున మేమిద్దరము నీతో వచ్చెదము. నీవు తప్పక శత్రునాశము చేయగల వాడవని హితవు పలికెను. అంతట అశ్వత్థామ కోపగించి శోకాతురత, అమర్షము, కార్యచింతనము, దేనినేని కోరుట ఈనాల్గింటిలో ఏ ఒక్కటి యున్నను నిద్రరాదు. ఈ నాల్గు నాయందుండుటచే నాకు నిద్ర యెట్లు వచ్చును? నాతండ్రి వధకు కారణమైన ధృష్టద్యుమ్నుని అతనికి సహాయపడిన పాంచాలుని విడువను. ఈ రాత్రి నిద్రపోవుచున్నసమయమున శత్రువులను వధించి పగతీర్చుకొందునని పలికెను. తిరిగి కృపాచార్యుడు అశ్వత్థామతో తాతా! నిద్రపోతున్న మనుష్యులను చంపుట ధర్మశాస్త్రవిరుద్ధము. అట్టిపని

చేయువాడు నరకమునపడును. ఇంతవరకు మీయందు ఎటువంటి పాపమును చూడలేదు. రేపు ఉదయమున శత్రువులను జయించవలసినదని హితవు పలుకగా అశ్వత్థామ మాతులా! మీరు చెప్పినది సరైనదే. కాని పాండవులు మొదటగా ధర్మమర్యాదను దాటిరి. అన్యాయముగా నాతండ్రిని చంపిరి. శిఖండిని ఎదురు పెట్టుకొని అర్జునుడు భీష్ముని వధించాడు. యుద్ధభూమి యందు అనశనవ్రతమున నున్న భూరిశ్రవసుని సాత్యకి చంపెను. భీముడు అధర్మ పూర్వకముగ యుద్ధమున దుర్యోధనుని తొడ విరుగ గొట్టెను. ఈ విధముగ వారందరు అధార్మికులే, వారిని

చంపకుండగ నాకు కంటిమీద కునుకు లేదని చెప్పి. అశ్వత్థామ గుఱ్ఱములను సిద్ధంచేసుకొని రథమెక్కి శత్రువుల వైపు బయలు దేరెను. కృతవర్మ, కృపాచార్యులు కూడా వారి మార్గమును అనుసరించిరి. వారు ముగ్గురు పాండవులు పాంచాలురున్న శిబిరము వద్దకు వెళ్ళిరి. అందరు శిబిరములలో నిద్రావస్థలో నుండిరి. వారు ముగ్గురు శిబిరం ద్వారం వద్ద నిలబడిరి. అచ్చట వింత ప్రాణిని చూచి వారు ఆశ్చర్యపోయిరి. అశ్వత్థామ అద్భుత ప్రాణిపై దివ్యాస్త్రములను కురిపించినను అవన్నియు నిష్ఫలమాయెను. అతని అస్త్రశస్త్రములు సమాప్తమగుటచే అస్త్రహీనుడై అద్భుత దృశ్యమును చూచుచు కృపాచార్యుని మాటలను స్మరించుచు ఖిన్నుడాయెను. ధర్మమార్గము నుండి తొలగి భయంకరమగు ఆపదలో పడితిని. దీని నుండి తప్పుకొనుటకు దైవము యొక్క ఆనుకూల్యము విడిచి మరియెక ఉపాయము కన్పించుట లేదని అనుకొని శంకరుని స్తుతించుచు అతనిని శరణువేడెను. ప్రసన్నుడైన పరమేశ్వరుడు అశ్వత్థామ శరీరములో ప్రవేశించి అతనికి దివ్యఖడ్గము నిచ్చెను. అశ్వత్థామ శిబిరము వైపు వచ్చుటచూచి అదృశ్యులగు రాక్షసులు పారిపోయిరి. అశ్వత్థామ శిబిరములోనికి ప్రవేశించగా కృతవర్మ, కృపాచార్యులు ద్వారము వద్ద నిలబడిరి. అశ్వత్థామ లోనికి ప్రవేశిస్తూ వారితో నేను శిబిరములోపల కాలునివలె వ్యవహరించెదను. నానుండి బ్రతికి బయటపడినవారిని మీరు అంతమొందించుడని చెప్పెను. లోనికి ప్రవేశించి అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడు మున్నగు వారిని చంపి తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొని సంతుష్టుడై ప్రాతః కాలమున శిబిరము బయటకు వచ్చి వృత్తాంతమంతయు ఇద్దరికి చెప్పెను. జీవించి ఉన్నట్లైతే దుర్యోధనునికి

ఈ సమాచారము వినిపించెదమని అనుకొని వారు ముగ్గురు దుర్యోధనుని వద్దకు వెడలిరి. అచ్చట దుర్యోధనుడు కొన ఊపిరితోనుండెను. ముగ్గురు రాజు దురవస్థనుచూచి దుఃఖించిరి. తొడలు విరుగుటచే అచేతనుని వలెపడి ఉన్న దుర్యోధనునితో అశ్వత్థామ మహారాజ! మీరు జీవించి ఉన్నట్లైతే సంతోషమును కల్గించెడి వార్తను వినుడు. పాండవుల పక్షమున ఏడుగురు, కౌరవుల పక్షమున మేము ముగ్గురము మాత్రము మిగిలితిమి. పాండవ పక్షమున పాండవులు అయిదుగురు శ్రీకృష్ణుడు, సాత్యకి, కౌరవపక్షమున నేను, కృతవర్మ, కృపాచార్యులు బ్రతికియుంటిమని చెప్పెను. అత్యంతము సంతోషదాయికమగు వార్తను వినుటచే దుర్యోధనునికి తెలివి వచ్చెను. అతడు వారితో మీయందరికి శుభముగుగాక. సుఖము లభించుగాక. స్వర్గమున మనం కలిసెదమని పలికి కన్నుమూసెను. మరణించుటకు ముందే దుర్యోధనుడు ముగ్గురు

వీరులకు అచ్చటినుండి వెళ్ళుటకు అనుమతి నిచ్చెను. వారు తమ తమ రథములపై నగరము వైపు బయలుదేరిరి. ద్రోణుని పుత్రుని ద్వారా దుర్యోధనుని మరణవార్తవిని సంజయుడు వ్యాకులముచెంది ప్రాతఃకాలమున నగరము వైపు బయలుదేరెను. అతడు ధృతరాష్ట్రునితో మీపుత్రులు స్వర్గస్థులగుటచే నేను చాలా దుఃఖించుచున్నాను. వ్యాసమహర్షి ఇచ్చిన దివ్యదృష్టికూడా నశించినదని పేర్కొనెను. పుత్రులమరణ వార్తవిని ధృతరాష్ట్రుడు చింతలో మునిగెను.

ధృష్టద్యుమ్నుని రథసారథి ధర్మరాజుతో అశ్వత్థామ నిద్రపోతున్న పాండవపుత్రులను చంపిన విషయమును వివరించెను. అమంగళ వచనములను విని యుధిష్ఠిరుడు మిక్కిలి విలపించెను. ద్రౌపదిని తీసుకొని వచ్చుటకు నకులుని పంపెను. శోకవిహ్వాలుడైనరాజు యుద్ధస్థలమునకు వెళ్ళి అమంగళమయ దృశ్యములను చూచి రోదించెను. విలపించెడి ద్రౌపదిని ధర్మరాజు ఓదార్చెను. ద్రౌపది మహారాజా! అశ్వత్థామ మస్తకముపై జన్మతః పుట్టిన మణిగలదు. యుద్ధమున అతనిని ఓడించి ఆ మణిని తీసుకొని వచ్చి నాకిచ్చిన దానిని నేను ధరించి ప్రాణములను నిలుపుకొందునని యుధిష్ఠిరునితో పలికెను. ద్రౌపది విలాపమును సహింపని భీమసేనుడు అశ్వత్థామ రథచిహ్నాములను గమనిస్తూ ముందుకుసాగెను. ద్రోణపుత్రుడు క్రోధియనియు, దురాత్ముడనియు, చపలుడు అని చెబుతూ అతడు

సుదర్శన చక్రమును అడిగిన సంగతి కూడా శ్రీకృష్ణుడు ప్రస్తావించెను. అశ్వత్థామకే బ్రహ్మాస్త్ర ప్రయోగము కూడా తెలియును. అతనినుండి భీమసేనుని రక్షించవలెనని చెప్పి శ్రీకృష్ణుడు యుధిష్ఠిరార్జునులతో కలసి రథమెక్కి భీమసేనుని వద్దకు వెడలెను. వారందరు భాగీరథీ నదీ తీరమునకు వెళ్ళిరి. అచ్చట వ్యాసుడుమున్నగు మహర్షులతో కలిసి కూర్చునియున్న అశ్వత్థామను చూచి భీముడు ధనుస్సు చేతబూని అటువైపు పరిగెత్తెను. వారిని చూచి అశ్వత్థామ పాండవనాశముకొఱకు దివ్యాస్త్రమును ప్రయోగించెను. దానిని వారించుటకు అర్జునుడు బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. వారివారి బ్రహ్మాస్త్రములను శాంతింపజేయుటకు నారదుడు వ్యాసుడు అచ్చటకు వచ్చిరి. ఇద్దరిని శాంతింపజేయుటకు ఇద్దరు ఋషులు అస్త్రముల నడుమ నిలబడిరి. వ్యాసమహర్షి ఆదేశానుసారము అర్జునుడు తన అస్త్రమును ఉపసంహరించుకొనెను. వ్యాసమహర్షి తన దివ్యాస్త్రమును ఉపసంహరించుకోమని అశ్వత్థామను కోరెను. వ్యాసుడు అశ్వత్థామతో మహర్షీ! నీ శిరస్సుననుండు మణిని వీరికీయ వలసినది. పాండవులు దానికి బదులుగా నీకు ప్రాణ దానము చేసెదరని విన్నవించెను. అశ్వత్థామ నేను ఈ అస్త్రమును
ఉపసంహరించలేను. దీనిని పాండవుల గర్భములపై విడుచుచున్నానని పలుకగా వ్యాసమహర్షి అందుకు సమ్మతించెను. ద్రోణ పుత్రుడు అట్లేచేసెను. శ్రీ కృష్ణుడు మిక్కిలి ఆనందించి. అశ్వత్థామతో పూర్వకాలమున అర్జునుని కోడలు విరాటుని కన్య ఉపప్లవ్య నగరమున ఉంటూ ఉండగా ఒక బ్రహ్మణుడు ఆమెను చూచి పుత్రి! కౌరవ వంశము పరిక్షీణము కాగానే నీకు ఒక పుత్రుడు జన్మించును. పరీక్షిత్తు అను నామధేయము కల అతడే తిరిగి పాండు వంశ ప్రవర్తకుడు కాగలడని చెప్పెనని శ్రీకృష్ణుడు చెప్పగా కోపగించిన అశ్వత్థామ అట్టైన నా అస్త్రము ఉత్తరగర్భముపై పడునని పలికెను. అదివిని శ్రీ కృష్ణుడు ఉత్తరగర్భంనుండి మరణించియే పుట్టును. అతనికి సంపూర్ణ ఆయుర్దాయముండునని చెప్పెను. అశ్వత్థామ మణిని ధర్మరాజునకిచ్చి అడవులకేగెను. అనశనవ్రతమున నున్న ద్రౌపదికి మణిని చూపుటకు ధర్మరాజు శ్రీకృష్ణాదులతో కలసి ఆమె వద్దకు వెళ్ళెను. ద్రౌపదికోరిక ననుసరించి యుధిష్ఠిరుడు దానిని ఆమె శిరస్సున అలంకరించెను.

మహారథులను చంపు శక్తి అశ్వత్థామకు ఎట్లు వచ్చినదని ధర్మరాజు అడుగగా శ్రీ కృష్ణుడు మహాదేవుని మహిమను వర్ణించి పరమేశ్వరుని అనుగ్రహంచేత అంతటి శక్తిలభించినదని తెలియజేసెను.

**ఇది సౌప్తికపర్వ కథాంశము.**